

—కె. సి. చౌదరి

జాతస్య మరణం ధ్రువం అని చావు అనేది వెనకా ముందుగా అందరికీ తప్పదు. పోతే ఈ చనిపోవడం అనేక కారణాలవల్ల పలు రకాలు కావచ్చు. చని పోయిన వ్యక్తి బ్రతికుండగా పొందలేని అభినందనలు చనిపోయిన మరుక్షణంలో సంతాప సభల రూపంలో పొందడం జరుగుతుంది. బ్రతికుండగా మెచ్చుకోలేని సాటి మానవుడు చచ్చాక చేతులెత్తి జోహారు లివ్వడం గొప్ప నాగరికతే మరి!

పూర్తిచేయలేని నష్టం కలిగింది. నాకు బాగా గుర్తు — ఎప్పుడే వ్యక్తి చనిపోయినా మా చీఫ్ ఆ ఉద్యోగి గురించి ఇలాగే చెప్పేవారు. ఎవరైనా రిటైరైనప్పుడు జరిగే ఫేర్‌వెల్ పార్టీలోకూడా ఆయన గురించి దగ్గర దగ్గర ఈ విధంగానే చెప్పడం మామూలు. ఇద్దరి ఆత్మల శాంతినే కోరేవారు. ఫేర్‌వెల్ పార్టీలో రెండు నిమిషాల మౌనం వహించ వలసి వచ్చేది కాదు. అంతే తేడా. అతని శబ్ద కోశంలో ఈ కొద్ది పదాలే ఉన్నాయి. ఎవరు చనిపోయినా, రిటైరైనా ఈ పదాలే వాడుతాడు. ఆ చనిపోయిన వ్యక్తి ఒకవేళ జీవించి ఉంటే ఈ పదాలు ఆయన కాన్ఫిడెన్షియల్ రిపోర్టులో వ్రాయబడవు. అది మాత్రం నిజం. ఒకవేళ ఆ వ్యక్తి జీవించి ఉంటే అతని పేరుకూడా మా చీఫ్‌కు తెలియదు. చావడంతో తరించాడు. ఇప్పు డతని సుగుణాలను ఒకటే స్తుతిస్తున్నారు. పాపం, బ్రతికి ఉంటే చీఫ్ నోటివెంట తన గురించిన పొగడ్త వింటే ఎంత సంతోషించి ఉండునో!

ఆయన సుగుణాలను చీఫ్ ఏకబిగిని వర్ణించడం చూస్తే వారిద్దరూ ఒక కంచంలో తిని, ఒక మంచంలో పడుకునే బాల్యమిత్రులేమో అనిపిస్తుంది. రేప్పొద్దున్న నేను పోతే నా గురించికూడా ఇలాగే స్తుతిస్తారు.

ఇరవై సెకండ్లు గడిచేయి. నా పని చూస్తే ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసినచోటే అన్నట్టుంది. చీఫ్‌ని చూస్తే మృత ఆత్మశాంతిని కోరడంలో దృఢంగా నిమగ్నులైనట్లుంది. కానీ, మృతుని ముఖంకూడా ఎప్పుడూ చూసి ఉండలేదేమో? నేనే ఎందుకు వెనక పడాలి? ఆత్మకి ప్రాణంతో ఏం సంబంధం? ఆత్మకి జనామరణాలు లేవు. దాని కేమీ రూపం ఉండదు. రంగు లేదు. ఆకారం లేదు. నిన్న సాయంత్రం తన గుమాస్తా కాయాన్ని వదిలివేసిన ఆ నిరాకార ఆత్మపై నా మనస్సుని లగ్నం చేయ ప్రయత్నించి కళ్లు మూసు కున్నాను. ఆఁ ఇది బాగుంది. కళ్లు మూసుకుంటే సులువుగా ఉంటుంది. ఆ మనిషిమీద ఆత్మీయత కలుగుతుంది.

పాపం, చనిపోయేడు.

చాలా మంచివాడు; అభాగ్యుడు.

అప్పుడప్పుడు తాగితే ఏం పోయింది? చచ్చిపోవలసిన కార్యం ఏదీ చేయలేదే?

ఎంతమందో తాగుతారు. తాగిన వాళ్లంతా చచ్చిపోవడం లేదే? ఇప్పుడు చనిపోవలసిన వయస్సు కాదు. పాపం, పెళ్లై అయిదు సంవత్సరాలే అయింది. భార్య బాగా వయస్సులో ఉండవచ్చు. తను చూడ్డానికి బాగుంటాడని విన్నాను. భార్యనికూడా ఎంచుకునే చేసుకుని ఉంటాడు. అందగత్తే కావచ్చు. పాపం, ఎటూ తోచని పరిస్థితిలో ఉందేమో? ఇద్దరు పిల్లలు, ముసలి అత్తగార్ల భారమంతా ఆమె మీదనే ఉంది. ఎలా భరించగలదు? ఎవరైనా అన్నదమ్ము లున్నారేమో తీసుకువెళ్లడానికి? ఆఁ కానీ, ఈ కరువురోజుల్లో లేనిపోని జంఝాటం ఎవడు పెట్టుకుంటాడు? కొంచెం చదువుకున్నదైతే ఫర్వాలేదు. చదువు కొన్నదే కావచ్చు. తను ఎమ్. ఎ. చదివాడట. భార్య కనీసం మెట్రిక్ అయినా చదివి ఉండదా? చీఫ్ దగ్గర మొర పెట్టుకుంటే ఎల్. డి. సి. ఉద్యోగం దొరికిపోతుంది. పూర్వంకూడా కొంతమంది విధవలకి దొరికింది. వారితో పాటు మరొకర్తె. ఏం పోయింది? పాపం, సంసారం పోషించుకుంటుంది. కానీ ఇంతమంది మగవాళ్ల మధ్యగా వయస్సులో ఉన్న ఆడది ఎంతవరకు తనను. . .

ఛీ ఛీ! ఇవన్నీ నే నాలోచించకూడదు. నేను నా సాటి ఉద్యోగి ఆత్మశాంతి కోసం ప్రార్థిస్తున్నాను. ఈలాంటి సమయంలో ఇవేమీ ఆలోచించకూడదు. తిరిగి కళ్లు మూసుకున్నాను. మరి ఇలాంటి అక్కర లేని విషయాలేవీ ఆలోచించను— అని నిశ్చయించుకున్నాను. ఆనిరాకార ఆత్మపై నా మనస్సు లగ్నం చేసేను. ఇప్పుడు ఆ నిరాకార ఆత్మ స్పష్టంగా కనిపిస్తున్నది. మూసుకున్న కనురెప్పలలో గుండ్రంగా ఎర్రని మచ్చలాగ అనిపిస్తున్నది. బహుశా అదే ఆత్మ ఏమో? కానీ ఆత్మ గుండ్రంగా ఉండదు. ఎర్రగాకూడా ఉండదేమో? ఊఁ హూఁ ఇది ఆత్మ కాదు. తప్పుడు వస్తువుల కోసం శాంతిని కోరడం అర్థంలేని పని.

కళ్ళు విప్పేసేను. దృష్టి చేతి నున్న వాచీమీద పడింది. సెకండ్లముల్లు ఏభై ఎనిమిది సెకండ్లు చూపుతున్నది. అంటే రెండు సెకండ్లు బాకీ ఉన్నాయి. కానీ ఏభైఎనిమిది సెకండ్లే అయ్యాయో లేక ఒక నిమిషం ఏభై ఎనిమిది సెకండ్లయ్యాయో అర్థం కావడం లేదు. నేను చాలాసేపే కళ్లు మూసుకుని నిలుచున్నాను. రెండు నిమిషాలు పూర్తి అయిపోతూ ఉండవచ్చు. చీఫ్ వేపు చూసేను. ఈ సమయంలో ఆయన మాకు గంటస్తంభంవంటి వారు. ఆయన గడియారంలో రెండు నిమిషాలు గడిచినప్పుడే అందరూ డిస్పర్స్ అవుతారు. తను అలాగే తల వంచి నిలుచుని ఉన్నాడు. బహుశా గడియారం చూసుకుంటూనే ఉండి ఉంటాడు.

సెకండ్లముల్లు బాగా ముందుకు నడిచింది. చీఫ్ అదే ముద్రలో ఉన్నారు. ఎవరూ కదలడం లేదు. అంటే ఇంకా ఒక్క నిమిషమే గడిచిందన్న మాట. ఇంకా మరో నిమిషం మౌనంగా నిలుచోవాలి. రెండు నిమిషాలు మౌనంగా నిలుచునే పద్ధతి ఎవరు పెట్టారో తెలియదు. కాని ఒక్క నిమిషం నిలుచుంటే చాలును. కావాలంటే రోజల్లా నించోవచ్చు. దాని వల్ల ఒరిగేదేమీ లేదు. చచ్చినవాడు చావనే చచ్చేడు.

చీఫ్ తల వంచుకొని అలాగే నిలుచున్నారు. పొట్టి.. బాగా పీలగా కూడా ఉంటారు. కానీ చీఫ్ కదా? అందుకే ఆయన పెర్సనాలిటీ అందరిలో ప్రత్యేకంగా కనిపిస్తున్నది. తల వంచుకు నిలుచుంటే పెర్సనాలిటీ బరువుకి వంగిపోతున్నట్లున్నారు.

చీఫ్ కుడిపక్కన తమ తమ జీతాల వరుసక్రమంలో నిలుచున్నారు మిగిలిన ఆఫీసర్లంతా. ఎడమ వేపు యూనియన్ కమిటీ సభ్యులు నిలుచున్నారు. గుమాస్తా లంతా ఎదురుగా అర్ధవృత్తాకారంలో నిలుచున్నారు. బంట్రోతుల గ్రూప్ అందరికంటె వెనకగా ఉన్నది.

తమ తమ స్టేటస్‌లను నిలుపు కుంటూ శోకప్రదర్శన జరుపుతున్నా రంతా.

చీఫ్ కుడిపక్క నిలుచున్న ఆఫీస ర్లంతా బట్టతలలవారే. ఈ విషయం నే నిప్పటిదాకా పరికించనేలేదు. ఆ దృశ్యం ఎంత చూస్తూ ఉంటే అంత మనోహరంగా కనిపిస్తున్నది. వెనక నుంచి వారి ఏడుగురినీ ఫోటో తీస్తే మంచి 'కంపోజిషన్' అవుతుంది 'ఉయి ఆర్ సెవెన్!' నా ఈ పరిశోధనను

వెంటనే ఎవరికైనా చెప్పేయాలని చాలా ఉబలాటం కలిగింది. పక్కన నిలుచున్నాయన వంక చూసేను. తల వంచుకుని ఉన్నాడు. చాలా గంభీరంగాకూడా కనిపిస్తున్నాడు. బహుశా తోటి ఉద్యోగి మరణం వలన గట్టిదెబ్బ తగిలి ఉండవచ్చును; లేక మృతుడు మరణానికి కొద్ది రోజుల ముందు ఈయన దగ్గర అప్పు తీసుకున్నాడేమో? అది మరి తిరిగి వచ్చే దారి లేదని విచారిస్తున్నాడో? ఆ వ్యక్తి వేపునుంచి నా దృష్టి మరల్చుకున్నాను. నా ఎదురుగా నిలుచున్న వ్యక్తి తన నడుము కింది భాగాన్ని ఒకటే గోక్కుంటున్నాడు. తల వంచుకొని తీరుబాటుగా గోక్కుంటున్నాడు. ఆయనని ఆపుదామనుకున్నాను. కానీ, సమయం అలాంటిది కాదని ఊరుకున్నాను. ఏమైనాసరే, ఈ దురదగాళ్ళ శోకసభలో నిలుచోకూడదు.

నలభై సెకండ్లు ఇంకా బాకీ ఉన్నాయి. నేను ఇప్పటిదాకా మృతుని ఆత్మ గురించి ఏమీ చేయలేదు. ఏ ఆత్మనైనా తెలుసుకుందుకు దానితాలూకు ఆకారాన్నికూడా తెలుసుకోవడం అవశ్యకం అని మొదటిసారిగా అనిపించింది. శరీరం లేని ఆత్మకు స్థిరత్వం లేదు. ఏ ఆత్మశాంతిని కోరుతామో దాని రూపం గుర్తు తెచ్చుకోవడం ముఖ్యం. ఆయన పనిచేసే జి. ఎ. డి. సెక్షనులో నా ఆత్మ తిరగడం ప్రారంభించింది. పూర్వం నా శరీరంకూడా ఆ సెక్షనులోకి చాలాసార్లే వెళ్ళింది. నా ఆత్మ తిరుగుతున్నది కానీ, కష్టపడేవాడు, పనియందు శ్రద్ధ చూపేవాడేకాక మంచి రంగులో పొడవుగా, ఎప్పుడూ ప్రసన్నంగా ఉండే వెర్రివాడెవడినీ 'లొకేట్' చేయలేకపోయింది. నా ఆత్మతో ఆ రూపం దొంగాటకం ఆడుతున్నట్టుంది.

నేను నిరాశతో తల నొక్కసారి విదిలించేను. తల విదిలించడం చాలా పని చేసింది. ఊహాజగత్తులో ఆ రూపం పట్టుబడింది. అదే రంగు, అదే పొడవు, అవే దట్టమైన కనుబొమ్మలు. ఆయనను నేను చాలా సార్లే చూసేను. సైకిల్ స్టాండు దగ్గర, కిళ్ళీ దుకాణం దగ్గర స్నేహితులతో కలిసి మాట్లాడుతూ, ఉండి ఉండి గట్టిగా నవ్వుతూ ఉండడం చాలా మాట్లు చూసేను. తన సెక్షనువేపు వెళుతూ ఉండగాకూడా చూసేను. నిన్న మట్టిలో కలిసిపోయిన రూపం ఆయనదే. అందులో సందేహం ఏమీ లేదు. పరిచయం లేకపోవడంచేత పేరు మాత్రం తెలియదు.

ఆ ఇప్పుడు కళ్ళు మూసుకుంటే దట్టమైన కనుబొమ్మలు గల ఆ నవ్వు ముఖం స్పష్టంగా కనిపిస్తున్నది. పాపం, నిన్న చనిపోయాడు. ఓ భగవంతుడా! నీకు సర్వం తెలుసును. ఎప్పుడూ గట్టిగా నవ్వుతూ ఉండేవాడు. ఆ ఆత్మ నదేవిధంగా ఎప్పుడూ సంతోషంగా ఉండేటట్లు అనుగ్రహించు, తండ్రీ! కానీ, ఆత్మని సంతోషంగా ఉంచడంలో ఏమీ అర్థం లేదు. ఆత్మ నిరాకారమే కాక నిర్వికారం కూడా.

ఆ రూపాన్ని మాని కేవలం ఆత్మనే ధ్యానంలో ఉంచుకోవడానికి ప్రయత్నం చేసేను. ఆత్మ కేవలం ఆత్మే. దానికి రంగు, ముఖం, సైజు అవి ఏమీ ఉండవు. కానీ, ఆ ఆత్మ జాగాలో ఒక బట్టతలమాత్రం కనిపిస్తుంది. దానితోపాటు వరుసగా ఒక్కసారి ఏడు బట్టతలలు కనిపిస్తున్నాయి. 'ఉయి ఆర్ సెవెన్!' కాని ఆయనది బట్టతల ఆత్మ కాదు.

చీఫ్ తల వంచుకొని ఉన్నారు. ఆయన కుడిపక్కనున్న బట్టతలలు అలాగే వంగి ఉన్నాయి. నా పక్క నిలుచున్న వ్యక్తి అలాగే గాంభీర్యాన్ని నిలబెట్టుకున్నాడు. ఎదురుగా నిలుచున్న వ్యక్తి గోక్కోవడంకూడా అలాగే సాగుతున్నది.


రెండు సెకండ్లు బాకీ ఉన్నాయి. సమయం చాలా తక్కువగా ఉంది. నిన్న చనిపోయిన మా ఆఫీసులోని వ్యక్తి ఆత్మకు శాంతిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థించడం తొందర తొందరగా ముగించేను.

నాకిప్పుడు చాలా సంతోషంగా ఉంది. ఒక సార్థకత కనిపించి తృప్తి కలిగింది. నిన్న చనిపోయిన వ్యక్తిని నేను గుర్తు తెచ్చుకోగలిగేను. ఆయన ఆత్మశాంతికై ప్రార్థించేను కూడా.

ఒక సెకండు బాకీ ఉంది. చీఫ్ మెల్లగా తల ఎత్తి నాలుగు పక్కలా పరికించేరు. బట్టతలలన్నీ మెల్లగా లేచి చీఫ్ వేపు చూసేయి. యూనియన్ నాయకుడుకూడా తల ఎత్తి అనుమానంగా చీఫ్‌వేపు చూసేడు. చీఫ్ డిస్పర్స్ అనమన్నట్లు తల ఆడించేరు. చీఫ్ తన ఛాంబరువైపు నడిచేరు. వెనకాలే బట్టతలలన్నీ తమ పేస్కేలు క్రమంలో నడిచేయి. యూనియన్ నాయకులు తొందర తొందరగా తమలో తాము సంప్రదింపులు జరిపి చీఫ్ ఛాంబరువేపు నడిచేరు. జనం సంశయంగా కదిలేరు. కొందరు యూనియన్ నాయకుల వెనక పడ్డారు. కొందరు ఎటూ పాలుపోక మొదట నిలుచున్న స్థలంలోనే తచ్చాడుతున్నారు. వెళుతూ వెళుతూ యూనియన్ సెక్రటరీ కొంచెం సేపాగండి అన్నట్లు చేతితో సంజ్ఞ చేసేడు. తనింక చీఫ్ దగ్గర తన డిమాండ్ వినిపిస్తాడు. మృతవ్యక్తి గౌరవార్థం ఈ రోజు సెలవు కావాలి. చీఫ్ ఒకవేళ ఆఫీసు మూసివేయడానికి ఒప్పుకోకపోతే కొంచెం సేపటిలో స్లోగన్స్ ప్రారంభిస్తారు.

'ఇంక్విలాబ్ జిందాబాద్'. 'శ్రామిక సోదరులు వర్ధిల్లాలి'. 'ఒక రోజు సెలవివ్వాలి లేదా ఆసనం వదలాలి'. 'పనిచేసే వాడే ఫలాన్ని పొందాలి'.

నేనేమీ తోచక అటు ఇటు చూస్తున్నాను. సీటు దగ్గరికి వెళ్ళాలని లేదు. ఈ సెలవు సంగతేదో తొందరగా తేలిపోతే మేటినీ షో చూడవచ్చు. కేంటీన్ వేపు వెళ్ళేను. కాఫీ కప్పు తీసుకొని ఒక బల్ల దగ్గర కూలబడ్డాను. వెనక కూర్చున్న ఒక గ్రూపు వారిలో వారు జోరుగా మాట్లాడుకోసాగేరు. చీఫ్ ఉపన్యాసం మీద విమర్శలు జరగసాగేయి. ఉన్నట్టుండి గట్టి నవ్వొకటి వినిపించింది. వెంటనే వెనక్కి తిరిగి చూసేను. ఆయనే. . . నేను ఇందాక నా ఊహాజగత్తులో ప్రయత్నించగా పట్టుబడ్డ ఆ ఆత్మ తాలూకు రూపమనుకున్నాయనే. . . ఈయన ఆత్మశాంతికే నేను భగవంతుని ప్రార్థించేను. ఆయన చాలా సంతోషంగా ఉన్నాడు. . . ★



ఊరి బయట

ఫోటో —పి. గురుమూర్తి (మద్రాసు-10)